**బోనం.. ఘనం**

తాండూరు రూరల్, జనవరి 19 : తాండూరు మండలం, పర్వతాపూర్ గ్రామంలో శుక్రవారం రక్తమైసమ్మ జాతర వైభవంగా జరిగింది. డప్పువాయిద్యాలతో మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

# మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తిచేయాలి

## పర్యవేక్షించాలని అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం

ఇబ్రహీంపట్నం, జనవరి 19 : ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ ప్రక్రియ పూర్తిచేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియపై పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లర్లకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీఎంఆర్ ప్రక్రియపై పౌర సరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాప్యానికి తావు లేకుండా మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిల్లర్ల నుంచి ఇతర మిల్లులకు కేటాయింపులు జరుపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, పౌర సరఫరాల అధికారి మనోహర్‌రాథోడ్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ విజయలక్ష్మి, మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మరో అవకాశం

## ఓటు నమోదుకు నేడు, రేపు స్పెషల్ డ్రైవ్

- ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు
- ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా విడుదల
- ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో 35,57,415 మంది.. వికారాబాద్ జిల్లాలో 9,71,011 మంది ఓటర్లు

రంగారెడ్డి, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరోసారి అవకాశం కల్పించింది. గత నెలలోనే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టి ఓటు నమోదు, సవరణలకు అవకాశం కల్పించింది. రంగారెడ్డి జిల్లాలో 35,57,415 మంది, వికారాబాద్ జిల్లాలో 9,71,011 మంది ఓటర్లున్నట్లు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలకు ఈనెల 22 వరకు అవకాశం కల్పించింది. అలాగే ఈనెల 20, 21 తేదీల్లో కొత్తగా ఓటు నమోదు కోసం ఉమ్మడి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నది. ఈ డ్రైవ్‌లో సంబంధిత ఫారాలను సమర్పించి నూతన ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతోపాటు, పేర్లు, చిరునామాలు తప్పుగా ఉన్న వారు సైతం సవరణకు దరఖాస్తులు ఇవ్వొచ్చు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించనున్నారు. డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించి ఫిబ్రవరి 8న తుది జాబితాను ప్రకటిస్తారు. అయితే అర్హులు ceotelangana.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. పేరు, అడ్రస్ తదితర తప్పులేమైనా ఉంటే సంబంధిత పోలింగ్ కేంద్రానికెళ్లి తప్పులను సరిచేసుకోవాలి.

**కొత్త ఓటరు నమోదుకు భారీగా దరఖాస్తులు**

కాగా వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఓటరు నమోదుకు అధికంగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటివరకు 33,650 దరఖాస్తులు రాగా అందులో 1539 దరఖాస్తులను ఎన్నికల అధికారులు తిరస్కరించగా మరో 8512 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. 23,599 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. ఆమోదం పొందిన కొత్త దరఖాస్తుల్లో పరిగి నియోజకవర్గంలో 6,283 దరఖాస్తులు, వికారాబాద్ నియోజకవర్గంలో 2,142, తాండూరు నియోజకవర్గంలో 8,267, కొడంగల్ నియోజకవర్గంలో 6,907 దరఖాస్తులున్నాయి. అదేవిధంగా ఓటరు గుర్తింపు కార్డుల్లో మార్పులు, చేర్పులకు 3,093 , అడ్రస్ మార్పులకు 11,431 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఉన్న దృష్ట్యా కొత్తగా మరో 30 వేల మంది ఓటర్లుగా చేరనున్నారు.

**ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఓటర్ల వివరాలు ఇలా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,67,359 | 1,63,786 | 36 | 3,31,181 |
| ఎల్బీనగర్ | 3,09,631 | 2,84,244 | 129 | 5,94,004 |
| మహేశ్వరం | 2,83,763 | 2,68,257 | 65 | 5,52,085 |
| రాజేంద్రనగర్ | 3,08,098 | 2,84,105 | 42 | 5,92,245 |
| శేరిలింగంపల్లి | 3,92,877 | 3,48,187 | 148 | 7,41,212 |
| చేవెళ్ల | 1,34,897 | 1,31,689 | 04 | 2,66,590 |
| కల్వకుర్తి | 1,22,884 | 1,19,262 | 07 | 2,42,153 |
| షాద్‌నగర్ | 1,19,698 | 1,18,233 | 14 | 2,37,945 |
| మొత్తం | 18,39,207 | 17,17,763 | 445 | 35,57,415 |

**వికారాబాద్ జిల్లాలో..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| పరిగి | 1,32,512 | 1,29,856 | 10 | 2,62,378 |
| వికారాబాద్ | 1,14,773 | 1,15,319 | 13 | 2,30,105 |
| తాండూరు | 1,16,846 | 1,22,798 | 7 | 2,39,651 |
| కొడంగల్ | 1,18,395 | 1,20,470 | 12 | 2,38,877 |
| మొత్తం | 4,82,526 | 4,88,443 | 42 | 9,71,011 |

**వచ్చే ఎన్నికలకు కీలకం..**

వచ్చే ఎన్నికలకు తాజా ఓటరు జాబితా కీలకం కానుండగా ఎన్నికల సంఘం ఓటు నమోదుకు సదావకాశాన్ని కల్పించింది. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆ తర్వాత పంచాయతీ, ఎం పీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుత ఓటు నమోదు కార్యక్రమంలో ఓటరుగా యువతీ యువకులు నమోదు చేయించుకుంటే ఆయా ఎన్నికల్లోనూ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. చాలా మంది ఓటు నమోదుపై నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయలేకపోయారు. ఈ పరిస్థితి మళ్లీ రాకుండా ఉండేందుకు ప్రస్తుత ఓటరు నమోదు కార్యక్రమం మంచి అవకాశం కానున్నది.

**సద్వినియోగం చేసుకోవాలి..**

అర్హులైన ప్రతి ఒక్కరూ నేడు, రేపు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఓటు ప్రాధాన్యాన్ని వివరించి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకునేందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి అధికారులు కృషి చేయాలి. ఇందుకు రాజకీయ పార్టీలు సైతం సహకరించాలి.

-శశాంక, రంగారెడ్డి కలెక్టర్

**అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..**

జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ నేడు, రేపు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. అవసరమైన వారు మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చు.

-నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్

తోపులాడుకుంటున్న కాంగ్రెస్ లీడర్లు

# కాలర్లు పట్టుకున్న కాంగ్రెస్ లీడర్లు

**రెండు వర్గాలుగా విడిపోయి తోపులాట**

**పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం**

బషీరాబాద్, జనవరి 19 : ఊరూరా జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలో నిర్వహించిన జెండా పండుగ రసాభాసగా మారింది. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జెండా ఆవిష్కరించి వెళ్లిపోగానే గ్రామంలోని కాంగ్రెస్ లీడర్లు రెండు వర్గాలుగా విడిపోయి తోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో మేము ముందా... మీరు ముందా, మీరు మొన్న వచ్చి పెత్తనం చేయడం ఏమిటని ఒక వర్గానికి చెందిన కొంత మంది మరో వర్గానికి చెందిన వారి కాలర్లు పట్టుకుని కొట్టుకునే దశకు వెళ్లారు. అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకుని ఇరు వర్గాలను పక్కకు లాగారు.

# దీపారాధన చేసి.. దీవెనలు కోరి..

## కొనసాగుతున్న జేపీ దర్గా ఉర్సు

కొత్తూరు, జనవరి 19: ఇన్ముల్‌నర్వ పరిధిలోని జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఘనంగా కొనసాగుతున్నది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉర్సుకు వచ్చిన మహిళలు తమ కోర్కెలు నెరవేరాలని దర్గా ఆవరణలో దీపారాధన చేశారు. అంతేకాకుండా గతేడాది కోరికలు తీరిన మహిళలు దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజూ భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సులో భాగంగా చివరి రోజు శనివారం ఖురాన్ పఠనం జరుగనున్నది.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

## రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. మహిళలను వేధించి పట్టుబడే వారి ప్రవర్తనపై ఆరు నెలల పాటు ప్రత్యేక నిఘా కొనసాగిస్తామంటూ.. ఇందుకు సంబంధించిన 'మహిళా సంరక్షణ నిఘా రిజిస్టర్'ను సీపీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను వివిధ రకాలుగా వేధించే నిందితులు ఒకసారి అరెస్టయిన తరువాత బాధితులపై కక్ష పూరిత వేధింపులు, దాడులు చేయకుండా ఉండేందుకు వారి ప్రవర్తన, రోజు వారీ కార్యకలాపాలపై మహిళా సంరక్షణ నిఘా రిజిస్టర్ ద్వారా నిఘా ఉంటుందన్నారు. ఈ రిజిస్టర్‌లో గతంలో లైంగిక నేరాలకు పాల్పడిన నేరస్తులు మళ్లీ అలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేలా నిఘా పెడుతామన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి, సెక్టార్ ఎస్సైల ఆధ్వర్యంలో ఈ రిజిస్టర్ రహస్యంగా నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైనప్పుడు భద్రతాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాచకొండ పరిధిలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**ఆకతాయిలకు కౌన్సెలింగ్**

రాచకొండ పరిధిలో షీ టీమ్స్‌కు పట్టుబడ్డ 118 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. బస్టాండ్‌లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, విద్యా కేంద్రాలు, మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో పోకిరీల చేష్టలను కట్టడి చేసేందుకు డెకాయి ఆపరేషన్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. వీరితో పాటు ప్రేమ పేరుతో, ఉద్యోగాలిప్పిస్తామంటూ, మద్యం మత్తులో వేధింపులు చేసే వారిపై వచ్చిన ఫిర్యాదులతో ఆయా పోలీస్‌స్టేషన్లలో నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. షీ టీమ్స్‌కు సమాచారం అందగానే బాల్య వివాహాలను నిలిపేస్తున్నామని, హయత్‌నగర్‌లో ఇటీవల ఒక బాల్య వివాహాన్ని ఆపేసినట్లు తెలిపారు. ఈ నెల పదిహేను రోజుల్లో సుమారు 9700 మందికి 60 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాలపై అవగాహన కల్పిస్తూ మీ కోసం షీ టీమ్స్ ఉన్నాయంటూ భరోసా ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో మహిళా భద్రత డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.



నిఘా రిజిస్టర్ ఆవిష్కరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

# బడిలో.. ఎన్నికల బరి..

**ప్రభుత్వ బడుల్లో మోగిన ఎస్ఎంసీ ఎన్నికల నగారా**

**నేడు నోటిఫికేషన్ జారీ**

రంగారెడ్డి, జనవరి 19(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల నగారా మోగింది. పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేడు నోటిఫికేషన్ రానుండగా ఈ నెల 29వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు కీలక భూమికను పోషిస్తున్నాయి. వీటికి చివరిసారిగా 2019లో ఎన్నికలు జరిగాయి. రెండేండ్ల కాలపరిమితి ఉండే ఎస్ఎంసీలు కోవిడ్ కారణంగా పాత కమిటీలే ఇప్పటిదాకా కొనసాగాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**షెడ్యూల్..**

పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం శనివారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తారు. 22, 23వ తేదీల్లో తల్లిదండ్రుల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. 24వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రుల తుది జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తారు. 29వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 1.30కు ఎన్నుకున్న సభ్యుల్లో నుంచి ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. అనంతరం మొదటి ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తారు.

**ఎన్నిక విధానం..**

ఎస్ఎంసీ సభ్యుడిగా ఎన్నిక కావాలంటే పాఠశాలలో చదివే విద్యార్థి తల్లిదండ్రి లేదా సంరక్షుడై ఉండాలి. 1 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లిదండ్రులనే సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ముగ్గురు చొప్పున 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 24 మందిని, ఉన్నత పాఠశాలల్లో(6 నుంచి 8 తరగతులకు) 9 మందిని సభ్యులుగా ఎన్నుకుంటారు. ఎన్నుకునే సభ్యుల్లో 2/3వ వంతు మహిళలు ఉండాలి. ఎస్ఎంసీ కమిటీకి హెచ్ఎం మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాఠశాలలోని ఉపాధ్యాయుడు, వార్డు సభ్యుడు, అంగన్‌వాడీ టీచర్, మహిళా ఏఎన్ఎం, మహిళా సంఘం అధ్యక్షురాలు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంసీ ఎన్నికను నిర్వహిస్తారు. ఎన్నికకు విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం 50 శాతం హాజరు కావాలి. దీనినే కోరంగా పరిగణిస్తారు. హాజరైనవారు చేతులెత్తే పద్ధతి, నోటి మాట ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. అవసరమనుకుంటే రహస్య బ్యాలెట్‌ను నిర్వహిస్తారు. ఎన్నికైన ఎస్ఎంసీ ప్రతి రెండు నెలలకు ఒకసారైనా సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది.

**ఎస్ఎంసీల విధులు..**

ఎన్నికైన ఎస్ఎంసీలు పాఠశాల కార్యకలాపాలను, విద్యార్థుల ప్రగతిని సమీక్షించాలి. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి, విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలి. బడీడు పిల్లలను బడిలో చేర్పించడానికి కృషి చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తూ సమీక్షించాలి. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం తదితర వాటి పంపిణీని పర్యవేక్షించాలి. పాఠశాలలకు మంజూరయ్యే నిధులు ఎస్ఎంసీ ఖాతాలలో జమ అవుతాయి. వాటిని సక్రమంగా ఖర్చు చేయాలి. పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీలు కృషి చేయాలి.

**పారదర్శకంగా నిర్వహిస్తాం: సుశీందర్ రావు, డీఈవో, రంగారెడ్డి**

ఎస్ఎంసీ ఎన్నికల కోసం విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. శనివారం నోటిఫికేషన్ జారీ కానున్నది. ఈనెల 29న ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్నికల ఆఫీసర్లుగా పాఠశాలల హెచ్ఎంలే ఉంటారు. కాబట్టి అప్పటివరకు హెచ్ఎంలకు సెలవులను రద్దు చేశాం.

**జిల్లాలోని పాఠశాలలు..**

రంగారెడ్డి జిల్లాలో 881 ప్రాథమిక పాఠశాలలు, 181 ప్రాథమికోన్నత పాఠశాలలు, 247 ఉన్నత పాఠశాలలు, 20 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు కలిపి మొత్తం 1,383 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఎన్నిక చేపట్టనున్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 771, ప్రాథమికోన్నత పాఠశాలలు 116, ఉన్నత పాఠశాలలు 176, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 18, మాడల్ స్కూళ్లు 9, ఏయిడెడ్ పాఠశాలలు 11, టీఎస్ఆర్ఈఐఎస్ 2, యూఆర్ఎస్ 1 ఉన్నాయి.

**హెచ్ఎంలకు ఆదేశాలిచ్చాం : డీఈవో రేణుకాదేవి**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. ఎన్నికల నిర్వహణపై జిల్లాలోని హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు అందించాం. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. జిల్లాలో 1064 ప్రభుత్వ పాఠశాలలు, 18 కేజీబీవీలు, 9 మాడల్, 11 ఎయిడెడ్, ఒకటి యూఆర్ఎస్, రెండు టీఎస్ఆర్ఈఐఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహిస్తాం.

## కొడంగల్ ప్రగతికి ప్రతిపాదనలు

# సిద్ధం చేయండి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, జనవరి 19 : కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖలవారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొడంగల్ ప్రభుత్వ దవాఖానను 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దవాఖానలో వాటర్ ప్లాంట్, రెండు అంబులెన్సులు, జనరేటర్‌తో పాటు అవసరమైన సిబ్బంది కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ సెంటర్ ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ద్వారా అవసరమైన సింగిల్, డబుల్ రోడ్లతో పాటు జీపీ బిల్డింగ్స్, కమ్యూనిటీ హాల్స్, వంతెనలు, అతిథి గృహం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, డొమెస్టిక్‌కు సంబంధించి నాణ్యమైన విద్యుత్తు సరఫరా కోసం అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి అవసరమైన సాగు తాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు 50 ఎకరాల స్థల సేకరణ వారం రోజుల్లో జరుగాలన్నారు. పశుసంవర్ధక శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని, వ్యవసాయ శాఖకు సంబంధించిన డిప్లమా కళాశాల ఏర్పాటుకు నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో జిల్లా స్థాయి తరహాలో అభివృద్ధి పరిచేందుకు అన్ని ప్రతిపాదనలను సిద్ధం చేసి, ప్రత్యేక అధికారికి సోమవారం వరకు అందజేయాలని అన్నారు. అధికారులందరూ పూర్తి బాధ్యతతో చురుకుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి